క్లుప్తంగా

ప్రజాదరణ చూసి ఓర్వలేక..



మోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

మాడ్గుల: రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే సోనియా, రాహుల్ గాంధీపై అక్రమ కేసులు పెట్టారని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహ్మద్ బాబా ఆరోపించారు. నిరసనగా సోమవారం బ్రాహ్మణపల్లి కూడలిలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేషనల్ హెరాల్డ్ పత్రికలో ఎలాంటి లావాదేవీలు జరగలేదని, ప్రజల్లో రాహుల్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకే.. కేంద్రం అక్రమ కేసులకు పాల్పడిందని విమర్శించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ రమేష్, నాయకులు అంజి, శివ, వేణుగోపాల్, రవి, శేఖర్, వరుణ్, విజయ్, పాష, వంశీ పాల్గొన్నారు.

25న చలో హైదరాబాద్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

ఆమనగల్లు: జీఓ 317 కారణంగా స్థానికత కోల్పోయిన ప్రభుత్వ ఉద్యోగులను వెంటనే వారి సొంత జిల్లాలకు బదిలీ చేయాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జీఓ బాధితుల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో జేఏసీ నాయకులు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీఓ కారణంగా సుమారు పదివేల మంది స్థానికత కోల్పోయారని ఆందోళన వ్యక్తంచేశారు. వారికి న్యాయం చేయాలని కోరుతూ.. ఈ నెల 25న చలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టామని, బాధిత ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు కానుగుల మల్లేశ్, గాజుల పవన్, ఆనంద్, జ్ఞానేశ్వర్, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులుతో నాటి విద్యార్థులు

మంచాల: మూడు దశాబ్దాల అనంతరం ఒకే వేదికగా కలుసుకున్న బాల్య మిత్రులు సందడి చేశారు. నాటి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకుంటూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆనందంతో కేరింతలు కొట్టారు. మంచాల మండలంలోని ఆరుట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1994– 1995 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు.. సోమవారం కాగజ్ ఘట్ పరిధి ఓ వెంచర్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు

ఈదురుగాలులకు ఒరిగిన హోర్డింగ్

తాత్కాలికంగా రోడ్డు మూసివేత



ప్రమాదకరంగా హోర్డింగ్

శంకర్‌పల్లి: పట్టణం, మండలంలో సోమవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడింది. దీంతో పలుచోట్ల చెట్లు విరిగిపోవడం, స్తంభాలు, హోర్డింగులు వంగిపోయాయి. పట్టణంలోని ఎస్‌బీ సూపర్‌మార్కెట్ బిల్డింగ్‌పైన అనుమతిలేని హోర్డింగ్ ఈదురుగాలుల దాటికి ప్రమాదకరంగా వంగింది. దీంతో మున్సిపల్ కమిషనర్ యోగేశ్, పరిశీలించి, అటు వైపు నుంచి సాయినగర్ కాలనీకి మార్గాన్ని తాత్కాలికంగా మూసి వేయించారు. అనుమతి లేకుండా హోర్డింగ్ పెట్టిన వారిపై చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు.

పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలి

పశువైద్యాధికారి అహ్మద్

మొయినాబాద్: పాడి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి అహ్మద్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్‌లో సోమవారం గాలికుంటు నివారణ టీకాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 245 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ప్రసన్నకుమార్, భీంరావ్, గోరేమియా తదితరులు పాల్గొన్నారు.

చక్రబంధంలో ‘పట్నం’ కూడలి

ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. హైదరాబాద్– నాగార్జునసాగర్ హైవేపై ఉన్న కూడలి.. నిత్యం వేలాది వాహనాలతో రద్దీతో ఉంటోంది. కానీ సిగ్నల్ వ్యవస్థ లేక పోవడంతో వాహన చోదకులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- ట్రాఫిక్ జాంతో నిత్యం అవస్థలు
- నియంత్రణ శూన్యం.. తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



ఇబ్రహీంపట్నంలోని అంబేడ్కర్ చౌరస్తా

ఇబ్రహీంపట్నం: నియోజకవర్గం కేంద్రమైన పట్నం చుట్టూ కేంద్ర, రక్షణ, ప్రైవేట్ సంస్థలు, విద్యా, వాణిజ్య సంస్థలు ఉన్నాయి. దీంతో పాటు ప్రధాన రహదారికి ఆనుకుని కొత్త బస్టాండ్ ఉంది. దీంతో సహజంగానే కూడలి మీదుగా నిత్యం వాహనాలు పరుగులు తీస్తుంటాయి. జనసంచారం భారీగానే ఉంటోంది. అలాంటి ప్రధాన రహదారిలో సిగ్నల్ వ్యవస్థ లేక ట్రాఫిక్ కష్టాలు అధికమవుతున్నాయి. రోడ్డు క్రాస్ చేసేందుకు నాలుగు వైపులా వాహనదారులు అష్టకష్టాలు పడుతున్నారు. ఇక ఉదయం వేళలో పాఠశాల, కళాశాల బస్సుల రాకపోకలు ఎక్కువగానే ఉంటాయి. ఈ సమయంలో మరింత కష్టమని స్థానికులు పేర్కొంటున్నారు.

రహదారి దాటడం గగనం

జనాభా, వాహనాల సంఖ్యకు అనుగుణంగా పట్నం రహదారి విస్తరణకు నోచుకోలేదు. హైదరాబాద్, నాగార్జునసాగర్‌కు, మంచాల మండల కేంద్రానికి, పాత ఇబ్రహీంపట్నంకు, బృందావన్, కేవి తండాలకు ఈ చౌరస్తా నుంచి వెళ్లాల్సి ఉంటుంది. ఇంతటి ప్రాముఖ్యత గల చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయలేదు. దీంతో ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. ఇష్టానుసారంగా వాహనదారులు దూసుకుపోతుండటమే దీనికి కారణమని స్పష్టంగా తెలుస్తోంది. పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్‌కు, మంచాల రోడ్డుకు వెళ్లాలంటే చౌరస్తా వద్ద రహదారి దాటడం గగనంగా మారుతోంది. ఏ వైపు నుంచి ఏ వాహనం దూసుకొస్తుందోనన్న భయాందోళన బాటసారులనే కాదు.. వాహన చోదకులను వెంటాడుతోంది.

ఫొటో తీయడం.. చలాన్ పంపడం

అంబేడ్కర్ క్రాస్‌రోడ్డులో ట్రాఫిక్ కష్టాలను ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడంలేదు. అడ్డదిడ్డంగా దూసుకుపోతున్న వాహనాల ఫొటోలు తీయడం, ఇంటికి చలాన్లను పంపడంతో సరిపెడుతున్నారు. వాహనాలను ఆపి పత్రాలను సరిచూడటానికే పరిమితం అవుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ట్రాఫిక్ సిగ్నల్ లేక వాహనదారులు, పాదచారులు పడుతున్న ఇబ్బందులపై వారు దృష్టి సారించడం లేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలి



వాహనాల రాకపోకలతో అంబేడ్కర్ చౌరస్తా నిత్యం రద్దీగా ఉంటుంది. నియంత్రణ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినప్పటికీ పోలీసులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి త్వరగా ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలి.

– సపావట్ రాజు నాయక్, మానవ హక్కుల వేదిక, జిల్లా కన్వీనర్

రోడ్డు దాటేందుకు ఇబ్బంది



ఇబ్రహీంపట్నం చుట్టూ అధిక విద్యాసంస్థలు, కంపెనీలు ఉన్నాయి. విద్యాసంస్థల సమయాల్లో ఈ చౌరస్తా మరింత రద్దీగా ఉంటుంది. రోడ్డు దాటేందుకు వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ప్రమాదాల నివారణకు, వాహనదారుల ఇబ్బందులు తొలగించేందుకు కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి.

– రాజ్‌కుమార్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి

భూ భారతితో సత్వర న్యాయం

- ఎంపీ, చామల, కలెక్టర్ నారాయణరెడ్డి
- ఇబ్రహీంపట్నంలో అవగాహన సదస్సు



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం: భూ భారతి 2025 చట్టంతో అధికార వికేంద్రీకరణ జరుగుతుందని, తద్వార ప్రజలకు సత్వర న్యాయం దక్కుతుందని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని శాస్త్రా ఫంక్షన్ హాలులో సోమవారం నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ చామల, కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. భూ రికార్డుల్లోని తప్పులను సులువుగా సరిచేసుకునే వెసులుబాటు ఈ చట్టంలో ఉందని తెలిపారు. గత ప్రభుత్వం తెచ్చిన ధరణితో అన్ని వర్గాల ప్రజలు అనేక అవస్థలు పడ్డారన్నారు.

ఆ భూములను వెలికితీస్తాం..

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. ధరణి అంటేనే బెంబేలెత్తిన రైతులకు భూ భారతి చట్టం ఉపశమనం కలిగిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. గత పాలకులు ధరణిని అడ్డం పెట్టుకుని ప్రభుత్వ భూములను కొల్లగొట్టారని ఆరోపించారు. ఈ చట్టం ద్వారా అన్యాక్రాంతమైన భూములను వెలికి తీస్తామన్నారు. నియోజకవర్గంలోని పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మంత్రి పొంగులేటిని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, టీపీసీసీఏ ఆర్డీఓ అనంతరెడ్డి, టీపీసీ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, మార్కెట్ చైర్మన్లు గురునాథ్‌రెడ్డి, చిలుక మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ సునీతారెడ్డిలు పాల్గొన్నారు.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు



లక్ష్మీనారాయణ స్వామి దేవాలయం

తలకొండపల్లి: మండల పరిధిలోని వెంకటాపూర్ శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 23 నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. 25వ తేదీ వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. 23న ఉదయం 9 గంటలకు అఖండ దీపారాధన, మండప పూజలు, అగ్ని ప్రతిష్ఠాపన, మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 24న ఉదయం ఆలయంలో అభిషేకం, మండప పూజలు, 11 గంటలకు స్వామివారి కల్యాణం, అనంతరం తీర్థ ప్రసాదముల స్వీకరణ. సాయంత్రం 4 గంటలకు బండ్ల ఊరేగింపు, 6 గంటలకు పల్లకీ సేవ, రాత్రి అఖండ భజన. 25న ఉదయం 3 గంటలకు స్వామివారి రథోత్సవం, తేరు, 7 గంటలకు మహా నీరాజనం, పెద్ద మంగళహారతి తదితర కార్యక్రమాలు చేపట్టనున్నామని పేర్కొన్నారు. దాతల సహకారంతో ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయని వెల్లడించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి, ఎంపీ మల్లు రవి, మాజీ ఎమ్మెల్యేలు చల్లా వంశీచంద్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొననున్నారు.

బెంగాల్ ప్రభుత్వం రద్దుకు డిమాండ్



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

ఆమనగల్లు: పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మున్సిపాలిటీ అధ్యక్షుడు విక్రంరెడ్డిలు డిమాండ్ చేశారు. బీజేపీ, హిందూ సంఘాల ఆధ్వర్యంలో బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసగా.. ఆమనగల్లు పట్టణంలో సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా హనుమాన్ ఆలయం నుంచి ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఎంఆర్ఐ చెన్నకేశవులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ముస్లింల అభివృద్ధి కోసం తెచ్చిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా బెంగాల్‌లో కొన్ని మత శక్తులు హిందువులపై దాడులకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. ఆ రాష్ట్రంలో శాంతి భద్రతలు లోపించిన కారణంగా మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాంపాల్‌నాయక్, మాజీ వైస్ చైర్మన్ దుర్గయ్య, మాజీ కౌన్సిలర్లు చెన్న కేశవులు, కృష్ణయాదవ్, నర్సింహ, కృష్ణనాయక్, బీజేపీ నాయకులు రవిరాథోడ్, ప్రశాంత్, మహేశ్, ఆనంద్, అంజయ్య, అల్లాజి, మనోహర్, నర్సింహ, మల్లేశ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రాక

మంచాల: భూభారతి చట్టంపై మండల కేంద్రంలోని శర్వంచ్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే అవగాహన సదస్సుకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి రానున్నారని పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం అనంతరం మంచాలలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. పాలక మండలి సభ్యులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

ముందస్తుగా పన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ

తుర్కయంజాల్: ముందస్తుగా 2025– 26 సంవత్సరానికి పన్ను చెల్లించి, 5 శాతం రాయితీ పొందాలని మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. రాయితో కూడిన పన్ను చెల్లించేందుకు ఈ నెల చివరి వరకు అవకాశం ఉందని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అదే విధంగా ట్యాక్స్ అసెస్‌మెంట్ చేయని నిర్మాణదారులు సెల్ఫ్ అసెస్‌మెంట్, లేదా మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

రైతు కుటుంబాలకు ఆర్థిక సాయం

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం కొత్తకుంట తండాకు చెందిన రైతు శంకర్‌నాయక్, పోలెపల్లి లాలయ్యలకు టాస్క్ సీఓఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఆర్థికసాయం అందజేశారు. కొత్తకుంటతండా రైతు శంకర్‌నాయక్‌కు చెందిన నాలుగు మేకలు పిడుగుపాటుతో ఇటీవల మృత్యువాత పడ్డాయి. మరో రైతు లాలయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న సుంకిరెడ్డి.. సోమవారం ఇరువురిని పరామర్శించారు. చెరో రూ.10 వేలు చొప్పున నగదు అందజేశారు. ఇందులో ఫౌండేషన్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి, శ్రీరాములు, అభినవ్‌రెడ్డి, రామకృష్ణ, రవి, శివ, సాయి, కిషన్ నాయక్, మోతీనాయక్, లాలు, పత్యానాయక్ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ సభను జయప్రదం చేయండి

ఆమనగల్లు: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు అర్జున్‌రావ్ కోరారు. ఆమనగల్లు మండలం రాంనుంతల, చింతలపల్లి గ్రామాల్లో సోమవారం పార్టీ నాయకులతో కలిసి రజతోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 27న జరిగే సభకు భారీ ఎత్తున ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు కుమార్, పంతునాయక్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ సత్యం, రాంనుంతల మాజీ సర్పంచ్ శ్రీనునాయక్, బీఆర్‌ఎస్ నాయకులు పరమేశ్, కేశవులు, వెంకటేశ్, కుమార్, లక్ష్మణ్‌నాయక్, ప్రశాంత్, అయోధ్య, స్కైలాబ్, వెంకటయ్య పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. సభను విజయవంతం చేయాలని పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్ కోరారు. ఈ సందర్భంగా ఆయన పోస్టర్లను ఆవిష్కరించారు. ఇందులో దోశ్యనాయక్, రమేశ్‌నాయక్, గణేశ్‌నాయక్, మణిపాల్, మల్లేశ్, సాయిలు, యాదయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి దేశవ్యాప్త సమ్మె



కమిషనర్ బాలకృష్ణకు నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మే 20న చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ ఆదిబట్ల మున్సిపాలిటీ కన్వీనర్ నర్సింహ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆదిబట్ల మున్సిపాలిటీ కమిషనర్ బాలకృష్ణకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని కోరారు. అసంఘటిత రంగ కార్మికులు, కాంట్రాక్టు, స్కీమ్ కార్మికులతో సహా కార్మికులందరికీ జాతీయ స్థాయిలో కనీస వేతనం రూ.26 వేలు అందజేయాలని డిమాండ్ చేశారు. పాత పింఛన్‌ను పునరుద్ధరించాలన్నారు. ఎస్‌పీఎస్, యూపీఎస్‌ను రద్దు చేసి, బోనస్ ప్రావిడెంట్ ఫండ్ చెల్లింపు అర్హతలపై అన్ని సీలింగ్‌లను తొలగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మల్లారెడ్డి, మల్లికార్జున్, వర్కర్లు గణేశ్, ఇందిరా, జయ, సదానంద్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అధికారుల బృందం



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి తదితరులు

యాచారం: మాల్ పంచాయతీ ఆత్మనిర్భర్ పంచాయతీ ప్రత్యేక విభాగంలో జాతీయ అవార్డును కైవసం చేసుకున్న సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ అధికారులు.. సోమవారం తొర్రూర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికారులు మరింత సమన్వయంతో పనిచేసి, అన్ని గ్రామాలను మాల్ మార్గంలో పయనించేలా కృషి చేయాలని సూచించారు. ఇందులో ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, పంచాయతీ అధికారి శ్రీలత, మాల్ కార్యదర్శి రాజు, మాజీ సర్పంచ్ కవిత ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఎమ్మెల్యే మల్‌రెడ్డి మంగళవారం మండలంలో పర్యటించనున్నారని తహసీల్దార్ అయ్యప్ప తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు సాయి శరణం ఫంక్షన్ హాల్‌లో భూభారతిపై రైతులకు అవగాహన సదస్సు ఉంటుందని చెప్పారు. కార్యక్రమానికి వ్యవసాయ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఆర్డీఓ అనంత్‌రెడ్డి పాల్గొంటారని ఆయన తెలిపారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

సీడీపీఓ షభానా బేగం



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ షభానా బేగం, అంగన్‌వాడీ సిబ్బంది

షాద్‌నగర్: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీఓ షభానా బేగం అన్నారు. పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెలిజర్ల గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ.. పౌష్టిక విలువలతో కూడిన ఆహారం తీసుకుంటే రోగ నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను మరింత పటిష్టం చేయడానికి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు ఉమాదేవి, సుజాత, ఆశకార్యకర్తలు మరియారాణి, హెచ్‌ఎం ఇమాన్యుల్ తదితరులు పాల్గొన్నారు.

రోగ నిరోధకశక్తి పెంపు

కొందుర్గు: గర్భిణులు, బాలింతలు విధిగా పోషకాహారం తీసుకొని రోగ నిరోధకశక్తి పెంచుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీత అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం వీరన్నపేట, కొందుర్గు మండలం చెక్కలోనిగూడ గ్రామంలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతం కార్యక్రమాలు చేశారు. అదేవిధంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోత్స్న, అంగన్‌వాడీ టీచర్లు ఇందిర, భాగ్యమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్



బ్రోచర్‌లు ఆవిష్కరిస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు

షాబాద్: విద్యార్థులకు ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. అనంతరం తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని బ్రోచర్‌లు ఏర్పాటు చేసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత విద్యార్హత కలిగిన ఉపాధ్యాయులతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. డిజిటల్ తరగతి బోధన, ఏఐ తరగతులు, ఎన్నో వినూత్న పద్ధతుల్లో బోధన అందిస్తున్నట్లు వివరించారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. అదే పాఠశాలలో చదువుతున్న విద్యార్థికి గురుకుల పరీక్షల్లో జిల్లాస్థాయిలో మొదటి ర్యాంక్ రావడం సంతోషకరమని, ఆ విద్యార్థిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సహకార సంఘం వైస్ చైర్మన్ మద్దూర్ మల్లేశ్, మాజీ సర్పంచ్ మద్దూరు శకుంతల, ఎంపీటీసీ మాజీ సభ్యులు మద్దూరు పాండు, గుత్తి సునీత, నాయకులు రామస్వామి, చెన్నయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కొందుర్గు: గ్రంథాలయ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

కొత్తూరు: గ్రంథాయాలు విజ్ఞాన భాండాగారాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలో సుమారు రూ.82 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రంథాలయాన్ని ఆయన సోమవారం గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం జాతీయ రహదారి నుంచి కేజీబీవీ హాస్టల్ వరకు రూ. 1 కోటితో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇరువురుమాట్లాడుతూ.. విద్యార్థులు, నిరుద్యోగుల కోసం గ్రంథాలయాల్లో ఆయా పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో నిర్వహించే పోటీ పరీక్షల కోసం సిద్ధమయ్యే విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భవిష్యత్‌లో చదువుకున్న వారికే అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఉంటుందనే విషయాన్ని గ్రహించి లక్ష్య సాధనకు కృషి చేయాలని యువతకు సూచించారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

రాజకీయాలకు అతీతంగా మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. పక్కా ప్రణాళికతో కొత్తూరును రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే మున్సిపాలిటీ అభివృద్ధి కోసం పెద్దమొత్తంలో నిధులు సైతం ప్రభుత్వం మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, వైస్ చైర్మన్ డోలి రవీందర్, నాయకులు సుదర్శన్‌గౌడ్, దేవేందర్‌ముదిరాజ్, నర్సింహ, సురేందర్, దేవేందర్‌యాదవ్, యాదయ్య, దేప్‌సింగ్, లైబ్రేరియన్ శ్రీనివాస్‌రాజు, మున్సిపల్ కమిషనర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

కొందుర్గు: అభివృద్ధి పనులకు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల కేంద్రంలో నూతన గ్రంథాలయ భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయ భవన నిర్మాణం కోసం రూ.1.20 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఇందుకుగాను టెండర్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. గ్రంథాలయ భవనం నిర్మాణానికి గ్రామస్తులు పెద్ది శ్రీనివాస్‌గుప్తా సోదరులు తమ తాత రామచంద్రయ్య జ్ఞాపకార్థం 600 గజాల స్థలం బహూకరించారు. ఈ సందర్భంగా స్థల దాతలను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ చైర్మన్ మదన్‌మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ వీరేషం, ఏఎంసీ వైస్ చైర్మన్ బాబార్, తహసీల్దార్ రమేశ్‌కుమార్, ఎంపీడీఓ లక్ష్మిఅనురాధ, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి, రాజు, నాయకులు పాల్గొన్నారు.